

శ్రీ షిర్డీ సాయిబాబా



శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దత్తాస్వామి

# శ్రమతో సేవ - సేవతో కైవల్యం

వ్యవస్థాపకులు: శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్          ఎడిటర్ : గర్రె సాయి సుబ్రహ్మణ్యం

శ్రీ సుబ్బరామయ్య సార్ జీవిత విధానం ద్వారా బోధించిన "శ్రమతో సేవ - సేవతో కైవల్యం" ను అనుసరించి మా జన్మలు ధన్యం గావించుటకు ఈ మాసపత్రికను ప్రారంభిస్తున్నాము. శ్రీ సుబ్బరామయ్య సార్ మనకందించిన అనుభవాలను, సాంగత్య స్మృతులను, సార్ ఆచరించి బోధించిన అమూల్య విషయాలను స్మరించుకొనుటకు, మహాత్ములు బోధించిన సత్సంగ, సద్గ్రంధ పఠనలకు ప్రేరణగా ఈ మా చిన్న సేవ.

గమనిక : ఎవరైనా ఈ మాగజైన్ లో తమ వ్యాసాలను, అనుభవాలను పంచుకోదలిచినవారు saimaster.sevatrust@gmail.com కు e-mail చేయగలరు

సంపుటి : 04          నేపథ్యం : శ్రీ సార్ లీలలు - బోధ          జ్యేష్ఠ పౌర్ణమి
సంచిక : 01

**సద్గురు శ్రీ సుబ్బరామయ్య మహారాజ్ ఆరాధన సంచిక**

05 జూన్ 2020

| | |
|---|---|
| శ్రీ సుబ్బరామయ్య సార్ ప్రవచనం | శ్రీ సుబ్బరామయ్య సార్ శ్రీ వెంకయ్య స్వామి యొక్క లీలలకు పరవశిస్తూ వివరించే విధానం మనందరికీ గురుస్తుతి చేయవలసిన విధానం తెలుపుతుంది.<br><br>http://saimastersevatrust.org/speeches/Caset5b_MatthaSmrithiGnanaMapohaNancha_15Min.mp3 |

మూకం కరోతి వాచాలం ! పంఘుం లంఘయితే గురుం !
యత్కృపా తమహం వందే ! పరమానంద మాధవం !

## సార్ లీలలు

**ఆశ్రిత కల్పవృక్షం** 2

**సర్వ జీవ స్వరూపాయ నమః** 14

**సార్ బోధలు:** 15

# ఆశ్రిత కల్పవృక్షం

తిరుమల శెట్టి నారాయణ10వ తరగతి అయిన తర్వాత తరచుగా స్వామి దగ్గర సేవ చేస్తుండే వాడు. సుబ్బరామయ్య సార్ అతనిని చూసి స్వామి సేవ చేయటానికి ఎక్కువ ప్రోత్సహించే వాళ్ళు.

ఒకసారి సార్ అతనితో "అరేయ్! నువ్విక్కడుంటే మీ నాయన ఎక్కడికీ వెళ్ళనివ్వడు. నీవు చదువుకోలేవు. అందువలన నీవు నెల్లూరులో ట్యూషన్ కి వెళ్లి 10 వ తరగతిలో తప్పిపోయిన సబ్జెక్ట్ లని క్లియర్ చేయి" అని చెప్పారు. అతను సుబ్బరామయ్య సార్ చెప్పినట్లే నెల్లూరులో ట్యూషన్ కి వెళ్లి సెప్టెంబర్ కల్లా అన్ని సబ్జెక్ట్ లని క్లియర్ చేశాడు.

పరీక్షల తర్వాత గొలగమూడిలో అతను తన నాన్నతో వ్యవసాయం, బర్రెలను చూసుకోవటం, స్వామి మందిరంలో సేవ చేస్తూ ఉండటంలో  అతనికి ఒక్క క్షణం తీరిక ఉండేది కాదు. కొన్ని రోజుల తర్వాత ఎవరికీ చెప్పకుండా అతను స్వామి దగ్గర చీట్లు పెట్టాడు - ఏమని ఇంటర్మీడియట్లో చేరాలా, ఐ టి ఐ లో చేరాలా, పాలిటెక్నిక్ లో చేరాలా అని పెడితే స్వామి పాలిటెక్నిక్ లో చేరమని స్వామి ఆదేశం ఇచ్చారు. దాన్ని తగ్గట్లుగా అతను ఫిబ్రవరి-మార్చిలో అప్లికేషన్ తీసుకువచ్చి సార్ కి ఇచ్చాడు. అప్పుడు సార్ వాళ్ళ అమ్మాయి సుమతక్క రాహుకాలం చూసి మంచి ముహూర్తంలో పాలిటెక్నిక్ అప్లికేషన్ ఫిల్ చేసింది. అతను పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష









రాస్తే 12,000 రాంక్ వచ్చింది. రెండు నెలల తర్వాత పాలిటెక్నిక్ కౌన్సిలింగ్ కి కాల్ లెటరు వచ్చింది. సార్ అతని నాన్నతో పాలిటెక్నిక్ ఇంగ్లీష్ మీడియం అయితే నారాయణ ఎట్లా చేస్తాడు అని ఎన్నోసార్లు వాపోయేవారు.

నారాయణ ఎప్పుడైతే వచ్చి స్వామి దగ్గర చీట్లు పెడితే స్వామి పాలిటెక్నిక్ లో చేరమని చెప్పారని చెప్పాడో అప్పటినుండి సుబ్బరామయ్య అయ్యవారు స్వామి చెప్పినట్లే పాలిటెక్నిక్ చదవటానికి ప్రోత్సహించారు. 1990 అక్టోబర్ లో కౌన్సిలింగ్ కి పిలిచారు. సుబ్బరామయ్య సార్ 'మీ ఆయనకి తెలియదు నేను వస్తాను' అని చెప్పి అతనిని తిరుపతికి తీసుకుని బయలుదేరారు. ప్రయాణంలో ఒక చిత్రం జరిగింది. గూడూరులో వారు రైల్వేస్టేషన్ నుండి బస్టాండ్ కి రిక్షాలో వస్తున్నారు. వారు రిక్షా దిగుతున్నప్పుడు సార్ ఒక బస్సును చూపి అది తిరుపతి బస్ ఏమో చూడమని చెప్పారు. అతను పరుగున వెళ్లి చూస్తే అది తిరుపతి బస్సు కాదని తెలిసింది. ఈ లోపల రిక్షావాడు వెళ్ళిపోయాడు. దాంట్లో అతని సర్టిఫికెట్లు ఉన్న బాగ్ ను మర్చిపోయాడు. వారు బస్టాండ్లో వెయిట్ చేస్తూ ఉంటే రిక్షా తొక్కే అతను వారిని వెతుక్కుంటూ వచ్చి ఆ సర్టిఫికెట్లు ఇచ్చాడు. అది భగవంతుని కృప అని అనుకున్నారు. తిరుపతి వెళ్ళిన తర్వాత కౌన్సిలింగ్లో శ్రీశైలంలో మెకానికల్ ఇంజనీరింగ్ సీటు ఉంది కానీ అతని నాన్న నెల్లూరు దగ్గర మాత్రమే చేర్పించమని, అలా చేస్తేనే డబ్బులు తక్కువ ఖర్చు అవుతాయని చెప్పటం వలన ఆ సీట్ అతను తీసుకోలేదు. గూడూరులో సివిల్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్

లో సీట్లు ఉన్నాయి. అప్పుడు సారు "మనకు మైనింగ్లో తెలిసిన వాళ్ళు ఉన్నారు. నువ్వు తీసుకో అందువలన దాంట్లో మంచి ఉద్యోగాలు ఉంటాయి జాయిన్ అవ్వు" అని అన్నారు. అందువలన అతను మైనింగ్ కోర్సులో జాయిన్ అయ్యాడు.

కాలేజీలో ఇంగ్లీష్ మీడియం వలన నారాయణకు పాఠాలు అర్థం గాక ఇంటికి వచ్చేసాడు. సుబ్బరామయ్య అయ్యవారికి ఈ విషయం చెప్పలేదు. అంతేగాక సార్ అంటే భయం అందువలన సార్ కి కనపడకుండా ఇంటి దగ్గరే ఉండేవాడు. ఒకసారి బోర్ లో నీళ్లు తీసుకొస్తుంటే, దూరం నుంచి సుబ్బరామయ్య సార్ అతనిని చూసి పిలిపించి కాలేజీ ఎలా ఉంది, ఏంటి సంగతులు అని అడిగారు. అతను 'ఇంగ్లీష్ మీడియం పాఠాలు అర్థం కావట్లేదని, కాలేజీ కి వెళ్ళను' అని చెప్పాడు. "అరే స్వామిని అడిగితే పాలిటెక్నిక్ తీసుకోమని చెప్పారు కదా అందువలన ఆయనే చూసుకుంటాడు. నీకంటే మొద్దు వాళ్ళు ఉంటారు. కాలేజీకి వెళ్ళు, అన్నీ స్వామి చూసుకుంటాడు" అని సార్ ప్రోత్సహించారు. సార్ మాట కాదనలేక భయంగానే అతను కాలేజీకి వెళ్లాను. అక్కడ ప్రతిరోజు క్రికెట్ క్రికెట్ ఆడటం, క్లాసులకు హాజరు అవడం, పాఠాలకి నోట్స్ ప్రిపేర్ చేసుకోవడంతో రోజంతా గడిచిపోయేది. అందువలన ఇంటికి వెళ్ళాలి అనే భావన పోయింది. అట్లానే చిత్రంగా అతనికి గవర్నమెంట్ వాళ్లు హాస్టల్ రూమ్ ని అలాట్ చేశారు. తర్వాత రెండు మూడు నెలలకి గొలగమూడి కి వచ్చినప్పుడు సుబ్బరామయ్య సారు అతనిని చూసి "ఏమోయ్ ఎలా ఉంది కాలేజీ" అని అడిగారు. అతను








ఆనందంగా 'చాలా బాగుంది సార్, నాకంటే చదవని వాళ్ళు ఉన్నారు' అని చెప్పాడు. అలా అతనికి మూడు సంవత్సరాలు జరిగిపోయింది. చివర్లో ఆరు సబ్జెక్టులు మిగిలిపోయాయి. అతను ఇంటికి వచ్చి సార్ దగ్గర కూడా వెళ్లలేదు. తన నాన్న చేత చెప్పి పంపించాడు. అతని నాన్నని సార్ అడిగి వాడిని ఒకసారి నా దగ్గరికి వచ్చి మాట్లాడమను అని చెప్పారు. అతను వెళ్లి సార్ తో మాట్లాడితే "తడవుకు రెండు చొప్పున వ్రాస్తే సంవత్సరంలో సబ్జక్ట్స్ అయిపోతాయిరా, నువ్వు ట్యూషన్ చెప్పించుకొని సబ్జెక్టులు రాయి" అన్నారు. అతను అట్లానే సార్ చెప్పినట్టు చేశాడు. నాలుగు సబ్జెక్టులు పూర్తి అయిపోయాయి.

నారాయణ నాన్నకి సుబ్బరామయ్య సార్ సాధన చేస్తున్నారని, అక్కడున్న స్వామి సేవకులు అందరికీ సార్ అంటే ఇష్టం కాబట్టి అభిమానం. అతని నాన్న సుబ్బరామయ్య సార్ కి ఏదైనా పని ఉంటే అతనిని ప్రోత్సహించి మిగిలిన పనులు ఏమీ చెప్పకుండా ఉండేవాడు. అందువలన సుమతి అక్క పెళ్లికి సార్ తో పాటు దగ్గరుండి పనిచేశాడు. సుమతక్క పెళ్లి అయిన తర్వాత సార్ అతనిని కలిచేడులో తనతో పాటు పనిచేసిన నారాయణరావు అనే ఫ్రెండ్ తో మాట్లాడి ఆయన దగ్గర మ్యాథమెటిక్స్ ట్యూషన్ చేరమన్నారు. అంతేకాదు చూపించడానికి సార్ స్వయంగా వచ్చి, ఆయనతో మాట్లాడి ఆయన్ని సార్ తనదైన శైలిలో బలవంతం చేసి ఒప్పించారు. ఆయనకి ఏదో శాస్త్రం తెలుసు- అందువలన సార్, నారాయణ ఏ దిక్కు నుండి వచ్చారు అనే విషయాలు చూసి సుబ్బరామయ్య సార్ తో నారాయణ పాస్ అవుతాడు అని, సాయంత్రం మాత్రమే చెప్తాను రమ్మని చెప్పారు.









ఆయన చెప్పినట్లు నారాయణ రోజుకి ఏడు గంటల కష్టపడే వాడు. దానితో అప్పుడు రాసిన మ్యాథమెటిక్స్ సబ్జెక్టు క్లియర్ అయిపోయింది.

ఇంకొక సబ్జెక్టు సర్వే ఉంది. నారాయణ గూడూరు వెళ్లి అక్కడే కాలేజీ దగ్గర హాస్టల్లో ఉండి ప్రిపేర్ అవుతూ ఉండేవాడు. ఒకసారి ప్రిపేర్ అవుతూ ఉంటే అతని మైనింగ్ హెడ్ అతనిని చూసి కొన్ని ఇంపార్టెంట్ క్వశ్చన్స్ చదువుకోమని చెప్పారు. అతను అట్లానే చదివాడు. ఆ క్వశ్చన్స్  ఎగ్జామ్లో రావటం, అతను ఆ సబ్జెక్టు క్లియర్ చేయటం చాలా చిత్రంగా జరిగిపోయింది. స్వామి పాలిటెక్నిక్ అని చీట్ల ద్వారా చెప్పటమే గాక పాలిటెక్నిక్ డిగ్రీ కూడా స్వామి ఇప్పించారు. అతనికి మంచి ఉద్యోగం వచ్చి ఆ ఉద్యోగంలో మంచి పేరు వచ్చింది. అతని పై ఆఫీసర్ కి అతని పనితనం మీద చాలా నమ్మకం. అది అతని అదృష్టం.

సుబ్బరామయ్య వారు చెప్పినట్లు చేస్తే ఇబ్బందులన్నీ తొలగిపోతాయి, చెప్పినది చేయకుండా ఉంటే ఇబ్బందులు వస్తాయి అనటానికి ఇది ఒక ఉదాహరణ : నారాయణ అక్కకు, ఆమె భర్తకు తగువై ఆమె పుట్టింటికి వచ్చింది. నారాయణ నాన్నతో సుబ్బరామయ్య సార్ "మనం ఆడపిల్ల వాళ్ళం తగ్గి ఉండాలి. నువ్వు నువ్వు వెళ్లి మీ అల్లుడితో మాట్లాడి అమ్మాయి కాపురం సరిచేసి రా" అని చెప్పారు. కానీ నారాయణ నాన్న మొండి పట్టుదలతో వెళ్లలేదు. కొంతకాలం తర్వాత నారాయణ బావ రెండో పెళ్లి చేసుకున్నాడు. నారాయణ అక్క

ఆత్మహత్య చేసుకుంది. సార్ మాట వింటే బాగుండేది అని అతనికి అనిపించింది.

నారాయణకు మ్యారేజ్ విషయంలో పెళ్లి సంబంధాలు చూస్తున్నారు అని సార్ తో చెప్పాడు. ఇప్పుడు పెళ్లి చేసుకున్న అమ్మాయి గురించి "ఆమెకు ఏమీ రాదు ఎక్కువ చదువుకోలేదు, ప్రపంచ జ్ఞానం లేదు" అని సార్ తో చెప్పాడు. సార్ "పెళ్లి చేస్తే నీకే బయట ప్రపంచం గురించి నేర్పిస్తుంది లేరా" అని చెప్పారు. ఆ అమ్మాయితోనే అతని పెళ్లి జరిగింది. ఇప్పుడు ఆ అమ్మాయే అతనికి వాట్సాప్ ఎలా ఉపయోగించాలో, వాట్సాప్ లో కాలింగ్ ఎలా చేయాలో, మెసేజ్ లు ఎలా చూడాలి అన్నీ కూడా నేర్పిస్తుంది. సార్ చెప్పిన మాట జరుగుతోంది.

నారాయణ సార్ ని సామాన్య మనిషిగానే చూశాడు. కానీ ఆయన గొప్ప మహనీయుడని అతనికి తెలియదు. వేణుగోపాల్ గారు ఎప్పుడైతే సార్ కి నమస్కారం చేసి, సార్ కి అన్నీ తెలుసు నారాయణ అన్నప్పుడు మాత్రమే అతను సార్ కి నమస్కారం చేసుకోవటం మొదలు పెట్టాడు. అంతేకాకుండా సార్ ఇంటి దగ్గర బావి త్రవ్వేటప్పుడు ఒక రాత్రి వర్షం వచ్చింది. సార్, నారాయణ దగ్గరగా వదుక్కొని పడుకొని ఉన్న సంఘటనను గుర్తు చేసుకుంటుంటే సార్ అంత గొప్ప మహనీయులయ్యినా ఎంత సామాన్యంగా అతనితో ప్రవర్తించారు అనేది అర్థం అవుతోంది.

సార్ దగ్గర అతనికి ఎన్నో సార్లు 'సార్ కి అన్ని విషయాలు' తెలుసు అనే సంఘటనలు కొన్ని ఇక్కడ ప్రస్తావించబడ్డాయి.

1. సాయి మాస్టర్ నిలయం నిర్మాణం జరుగుతున్నప్పుడు కసుమూరు వెళ్లి బెడ్ కంకర తీసుకురా అని చెప్పి అతనిని పంపించారు. అక్కడ ఎవరితో మాట్లాడాలి, అడ్రస్ అన్నీ చెప్పారు. అతను అక్కడికి వెళ్ళి సార్ చెప్పిన అడ్రస్ ప్రకారం వెళితే అన్ని పనులు చాలా త్వరగా అయిపోయాయి. సార్ దగ్గరికి వచ్చి మీకు అక్కడ అడ్రస్ ఎలా తెలుసు అంత కరెక్ట్ గా చెప్పారు అని అడిగితే ఒక నవ్వు నవ్వారు.
2. ఇంకొకసారి స్టోన్ హౌస్ పేట మస్తానయ్య అనే మెడికల్ రిప్రజెంటేటివ్ ఇంటి అడ్రస్ ఇచ్చి జ్వరానికి, విరేచనాలకు, ఒళ్లునొప్పులకు మందులు తీసుకురమ్మన్నారు. ఈ మందులను సార్ దగ్గరకు ఎవరైనా అనారోగ్యంతో వచ్చి అడిగితే వాటిని వాళ్లకి ఇచ్చేవారు. సార్ 'కరెక్టుగా అడ్రస్ చెప్పారు. మీరెప్పుడైనా మస్తానయ్య ఇంటికి వెళ్లారా' అంటే "ఎప్పుడూ వెళ్ళలేదు. ఎప్పుడో నా చిన్నప్పుడు ఆ ఏరియా చూశాను. అందువల్ల నాకు తెలిసింది అట్లా" అన్నారు. మస్తానయ్య అమ్మాయి చాలా బాధపడుతూ ఒక ఉత్తరం రాసి సార్ కి అందించమంది. నారాయణ గొలగమూడిలో సార్ కి ఇస్తే సార్ చూడకుండా "అంటు రాకూడదు, బొంటు రాకూడదు" వ్రాసి ఉంటుంది అని ఆ ఉత్తరం ప్రక్కన పెట్టి సార్ స్నానానికి వెళ్లారు. అతను ఆ లెటర్ తీసుకుని చదివాడు. దాంట్లో కరెక్ట్ గా ఆ అమ్మాయి తన పెళ్లికి అంటు రాకుండా చేయమని వెంకయ్య స్వామిని ప్రార్థించమని వ్రాసింది.



శ్రీ షిర్డీ సాయిబాబా



శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దగ్గాస్వామి

కేవలం 'సార్ చెప్పడం వల్ల మాత్రమే భరద్వాజ మాస్టర్ కృప పొందగలిగాను' అని నారాయణ చెపుతాడు.

ఒకసారి నారాయణ అతని నాన్న గురించి 'స్వామి దగ్గర ఉన్నా ఏం లాభం, కొన్ని పనులు చేస్తున్నాడు' అని అన్నాడు. సార్ "వాళ్ల పూర్వజన్మ సుకృతం. వాళ్ళ తప్పులు కాకుండా వాళ్ళలో ఉన్న మంచిని గుర్తించి అది తీసుకోవాలి" అని చెప్పారు.

నారాయణ ఇంటికి సార్ ప్రత్యేకంగా వచ్చి గుంట త్రవ్వించి శంకుస్థాపన చేశారు. సార్ చెప్పినట్లుగానే వారు ఇల్లు కట్టుకొన్నారు.

నారాయణ పెళ్లప్పుడు సారు అతనితో "ఒక 30 నిమిషాలు పూజ చేయరా, తర్వాత నువ్వు చేయలేవురా" అన్నారు. సార్ చెప్పినట్లే చేసాడు. పెళ్లి అయిన తర్వాత నుంచి అతనికి పూజ చేయటానికి బొత్తిగా సమయం దొరకటం లేదు.

2011 సంక్రాంతినాడు నారాయణ సార్ దగ్గర పని చేసిన తర్వాత అక్కడే కూర్చుని ఉన్నాడు. మధ్యాహ్నం రెండున్నర గంటలకు సార్ అతనితో "ఇక్కడే ఉంటే ఆ అమ్మాయి తినదురా! నీకోసం ఎదురు చూస్తుంది. వెళ్లి తిను" అన్నారు. అలానే నారాయణ ఇంటికి వెళ్ళేసరికి అతని భార్య అన్నం తినకుండా అతని కోసం ఎదురు చూస్తున్నది.

నారాయణకు ఏ ఇబ్బందులు వచ్చినా కూడా సార్ దగ్గరకు వస్తే ఆ బాధలు తొలగి పోతాయి.

పనిరీత్యా చీమకుర్తిలో అతను ఇల్లు తీసుకున్నాడు. అక్కడి నుండి ఒంగోలు కి రావాలని చాలా ప్రయత్నించాదు కానీ ఎక్కడా ఇల్లు దొరకలేదు. అతను సార్ దగ్గరకు వచ్చి చెప్పాడు. సార్








"దొరుకుతుందిలే" అని ఉత్సాహపరిచారు. దాంతో అతను ఏ ప్రయత్నం చేయకుండా ఉన్నాడు. అతని మేనేజరు తనకు తెలిసిన వాళ్ళు ఒంగోలులో ఉన్నారు, వాళ్ళ ఇల్లు అద్దెకు ఇస్తారు అంటే అక్కడ నారాయణ పై పోర్షన్ అద్దెకు తీసుకున్నాడు. కానీ అది మేడ మీది పోర్షన్ అవడంవల్ల అతను ఇంకొక ఇల్లు కోసం ప్రయత్నిస్తే 4500 రూపాయల బాడుగకు గ్రౌండ్ ఫ్లోర్ లో ఒక ఇల్లు దొరికింది.

**ప్రాణాపాయం నుండి కాపాడిన సార్ :**

ఒకసారి ఏప్రిల్ 24 2016 నారాయణ పని చేసే మైన్స్ లో ఒక చోట పై నుండి ఒక బండ క్రింద పడింది. నారాయణ ఒక సంవత్సరం క్రితం ఆ బండి తీసేయాలి అని చెప్పాడు కానీ అప్పుడు ఎవరు ఆ మాట వినలేదు. సార్ దయ వలన ఎవరికీ ఏ ప్రమాదం జరగలేదు.

2016 ఏప్రిల్ 2 నారాయణ మైన్ లో పని చేస్తున్నప్పుడు అతని కాలికింద బండ జారిపోయింది. అతను వెనక్కి పడ్డాడు, బండ ముందుకు పడింది. అలా కాకుండా అతను ముందరకు పడినట్లయితే అతనికి ప్రాణాపాయం కలిగేది. ఇది కేవలం సార్ కృప వలన మాత్రమే జరిగింది. ఎందుకంటే అంతకు ముందు ఒకరోజు రాత్రి కలలో సార్ కనబడ్డారు, నవ్వుతున్నారు. స్వామి ఈ రూపంలో కనబడ్డారు అని అతను అనుకున్నాడు. అంతే కాకుండా అతను అంతకు ముందు దర్గా స్వామి దర్శనానికి వెళ్ళినప్పుడు స్వామి అతనితో "నీవు కష్టపడి పని చెయ్, నేను చూసుకుంటాను. మంచి పేరు వస్తుంది" అని ఆశీస్సులు ఇచ్చారు. అతను పని బాగా చేస్తాడని అతని ఆఫీసులో అతనంటే చాలా అభిమానం.

## సార్, భరద్వాజ మాస్టారు వేరు కాదు:

చాలాసార్లు నారాయణ తన ఇంట్లో ఇబ్బందుల గురించి ఒంగోల్ మాస్టర్ గారి సమాధి దగ్గర బాధపడితే ఆ రోజు రాత్రి గానీ ఆ తర్వాత రోజు రాత్రి కానీ సార్ కలలో కనబడి atani మనసుని సమాధాన పరుస్తారు. స్వప్న దర్శనం ద్వారా మేము ఇద్దరం ఒకటే అని మాస్టర్ గారు, సార్ చెపుతున్నారు అని నారాయణ చెపుతాడు.

అంతేకాకుండా సార్ ఒకసారి నారాయణతో "నీవు నాలుగు రూమ్ లు వేసుకుంటే నీ జీవితం గడిచిపోతుంది" అన్నారు.

పొత్తూరి వెంకటేశ్వరరావు గారు సార్ దగ్గర చీట్లు పెట్టి ఆ ఆజ్ఞల ప్రకారం ఇల్లు కట్టిస్తున్నారు. చాలా రోజుల పాటు అనుకున్న విధంగా కట్టుబడి జరగట్లేదు. దాన్ని చూసి వెంకటేశ్వరరావు సార్ పాఠం దగ్గర 'ఏమిటి సార్! మీరు చెప్పినట్లు చేయిస్తుంటే కూడా పని సరిగ్గా జరగట్లేదు' అని వాపోయాడు. తర్వాత సోమవారం వస్తామన్న బేలుదారు శుక్రవారం వచ్చి ఆదివారం కూడా పనిచేస్తూ ఒక వారం లోపల అంతకు ముందు జరగని పని కూడా అయిపోయింది. దానితో సార్ నిత్య సత్యులు అని వెంకటేశ్వర రావుకు దృఢపడింది.

వేణుగోపాల్ గారి నాన్నగారికి అనారోగ్యమై ఒకనాడు స్పృహ లేకుండా పడిపోయారు. వేణు తమ్ముడు, తిరుమల శెట్టి నారాయణ ఆయనను పరీక్ష చేసి చనిపోయారని తెలుసుకున్నారు. వెంటనే గుజరాత్ లో పని చేస్తున్న వేణుగోపాల్ కి ఫోన్ చేసి త్వరగా రమ్మని చెప్పారు. వేణుగోపాల్ నెల్లూరుకి ట్రైన్ లో దిగిన తర్వాత ఇంటికి వెళ్ళే

ముందర గొలగమూడి వెంకయ్యస్వామి దర్శనం చేసుకుని వెళదామని సార్ దగ్గరకు వచ్చారు. ఆయన ఏమీ చెప్పకుండానే సార్ అతనితో "మీ నాన్న బాగానే ఉన్నాడు. నువ్వు స్వామి దర్శనం చేసుకుని వెళ్ళు" అని చెప్పారు. అలానే వేణుగోపాల్ గారు ఇంటికి వెళ్లేసరికి వాళ్ళ నాన్నగారు అంగడిలో కూర్చుని పని చేసుకోవటం చూసి వేణుగోపాల్ గారు ఆశ్చర్య పోయారు. భోజనాల దగ్గర వల్ల నాన్నగారు నేను యమ భటుల దగ్గరకి వెళ్ళాను కానీ నన్ను మరలా పంపించేశారు. అక్కడ నుండి 2-3 రోజుల తర్వాత వేణు గోపాల్ వాళ్ళ అత్తగారింటికి వెళ్లారు. తర్వాత 2 రోజులకు వాళ్ళ నాన్నగారు శరీరం వదిలివేశారు. వేణుగోపాల్ అంటుంటారు 'సార్ కి మా నాన్నకి బాగాలేదని ఎలా తెలుసు, అంతేగాకుండా సార్ మా నాన్న ప్రాణాలు విడిచిన తర్వాత దూరంగా ఉన్న సార్ ఆయనకు ప్రాణభిక్ష పెట్టటం, శరీరం వదిలే ముందర 4 రోజులు హాయిగా ఉంచటం అంటే సార్ సర్వసమర్ధత్వము, ఈ జగత్తు అంతా ఆయన (ఆ విశ్వ చైతన్య) క్రీడ, కృప మాత్రమే" అంటారు.

కిషోర్ 2004లో మొదటిసారి గొలగమూడి కి వచ్చాడు. ఆ తర్వాత ప్రతి నెల ఒకసారి శ్రీ వెంకయ్య స్వామి దర్శనం చేసుకుంటూ ఉండేవాడు. సార్ దగ్గరికి వచ్చినప్పుడు సార్ మాటలు అతను వినేవాడే కానీ ఏనాడూ మాట్లాడలేదు. ఒకరోజు మధ్యాహ్న ఆరతి చేస్తున్నప్పుడు సార్ తో మాట్లాడాలనిపించింది. మధ్యాహ్న హారతి అయిన తర్వాత సార్ శ్రీ సాయి మాస్టర్ నిలయం నుండి బయటకు వస్తూ అతనితో

ఏమైనా మాట్లాడాలా అని అడిగారు. కిషోర్ అవునని చెప్పేసరికి కిషోర్ ని సార్ తమ ఇంటి మేడ మీదకి తీసుకెళ్లి మాట్లాడరు. అంటే అతని మనస్సులోని ఆలోచనలు సార్ కి తెలుసు.

కిషోర్ శ్రీపాద శ్రీ వల్లభస్వామి అంతర్ధానమైన కురువపురం వెళ్ళినప్పుడు క్రింద పడ్డాడు. ప్రక్కటెముకలు దగ్గర నొప్పి ఉండేది. స్వామి విభూతి వ్రాసినా నొప్పి తగ్గలేదు. బ్రహ్మం గారి మఠం దగ్గర సార్ కి చెపితే విభూతి రాయమన్నారు. సార్ చెప్పినట్లు విభూతి రాసిన రెండు రోజులకు నొప్పి తగ్గిపోయింది.

కిషోర్ 40 రోజులు సమ్మర్ హాలిడేస్ లో గొలగమూడిలో దీక్ష చేస్తున్నాడు. దీక్ష మధ్యలో అతనికి మోకాలు నుంచి కాళ్ల వరకూ దురద పుట్టింది. అతను తన కాళ్ళను దాదాపు ప్రతి నిమిషం గీక్కునేవాడు. ఒకరోజు బాధ భరించలేక మనసులో శ్రీ సుబ్బరామయ్య సార్ మహనీయులయితే తనకు దురద తగ్గిపోవాలి అని అనుకున్నాడు. చాలా చిత్రంగా రెండు మూడు గంటల తర్వాత దురద పోయింది








# సర్వ జీవ స్వరూపాయ నమః

ఒకరోజు సార్ పెరట్లో నాగుపామును అక్కడ ఉన్న భక్తులకు చూపుతూ ఇక్కడ ఒకరు ఉన్నారు అని చెప్పి పాముతో నువ్విక్కడ ఉంటే భయ పడతారు అని అనగానే ఆ పాము బయటకు వెళ్లి మాయమయిపోయింది

వేణుగారు గొలగమూడిలో ఇల్లు కట్టిన కొత్తలో దేవుని గదిలో కూర్చొని పుస్తకం చదువుకుంటున్నారు. శ్రీ సార్ ఉత్తరం ప్రక్క ఉన్న కిటికీ లోంచి చూస్తూ "ఎవరు వచ్చారో చూడు!" అని అన్నారు. వేణు గారు చూచి 'పాము సార్ ' అని అరిస్తే అది ఏమి చేయదని శ్రీ సార్ చెప్పారు. కొంతసేపటికి ఆ పాము బయటకు వచ్చి సార్ వాళ్ళ ఇంటి ముందర ఉన్న కస్తూరి చెట్టు మీదకి పాకి వెళ్ళింది. వేణు గోపాల్ గారు సార్ తో ఆ పాము చెట్టు మీదకు వెళ్ళింది, దాన్ని పంపించేద్దాం అని అంటుంటే సార్ ఆయనతో ఎక్కడ ఉంది అని అన్నారు. వేణు గోపాల్ గారు చూస్తే అక్కడ ఆ పాము లేదు.

ఒకసారి సార్ ఇంటి పెరట్లో ఒక బండ క్రింద పాము ఉంది. సాయి మాస్టర్ నిలయంలో పని చేస్తున్న బేలుదారు సుబ్బారావుని పిలిచి ఆ బండ క్రింద ఒక జంతువు ఉంది తీయి అని చెపితే బేలుదారు బండ క్రింద పామును చూసి భయపడుతుంటే అది ఏమి చేయదు అని చెప్పారు. ఆ పాము మెల్లగా వెళ్ళిపోయింది.



శ్రీ షిర్డీ సాయిబాబా



శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దగ్గాస్వామి

# సార్ బోధలు:

- భగవంతుడు మన నుండి కోరేది : మన మనస్సు, కాలము, కృతజ్ఞతా భావము
- సాయి శివ ఒకరోజు కేక్ తిన్నాను అని శ్రీ సార్ కి చెప్తే దానికి సార్ "ఏముందిలే బుద్ధికుశలత తగ్గుతుంది" అని అన్నారు.
- ఇంకొకసారి సాయి శివ తో సార్ "సేవ చేస్తూ ఉంటే స్వామి కృప వస్తుంది. స్వామి కృప వలన బలహీనతలు పోతాయి" అని చెప్పారు.
- 12 అక్టోబరు 2005 న సార్ రవి తో ఎవరి వంట వారు వండుకోవడం గురించి చెబుతూ "అప్పుడే విత్తనం నుండి బయటకు వస్తున్న మొలక మీద పెద్దగా గాలి వాన వస్తే ఏమవుతుంది? అది పూర్తిగా చచ్చిపోతుంది. అదే పెద్ద వృక్షమయ్యాక పెద్ద తుఫాను వచ్చినా ఏమీ నష్టం ఉండదు. వేరే వాళ్ల అన్నం తింటే వారి ప్రభావం మనపై ఉంటుంది" అన్నారు.
- ఒకరోజు రవితో సార్ మాట్లాడుతూ "ఈ జన్మలో వైరాగ్యము, ఇంద్రియములను నిగ్రహించుట అలవరచుకోకుంటే మనలను భగవంతుడు కూడా రక్షించలేడు" అన్నారు.

# శ్రీ సుబ్బరామయ్య సర్ లెటర్స్

శ్రీ సార్ లెటర్ లను ఈ క్రింది అంశాలుగా సమీకరించుచున్నాము.

1. **నిత్య పారాయణ, పూజ, సత్సంగం యొక్క గొప్పతనం**
2. **కష్టాలు-అవగాహన**
3. **గురు సేవ- అవగాహన**
4. **సాధన-గురుకృప**

## నిత్య పారాయణ, పూజ, సత్సంగం యొక్క గొప్పతనం

గొలగమూడి

22-09-1994

పూజ్య గురుబంధు నడిపల్లి నాగమణి గారికి నమస్కారములు. శ్రీ దర్గాస్వామి వారు నిత్యం ఉపదేశాలు (అధ్యాయం) చదవమని చెప్పినట్లు భావించండి. ప్రతినిత్యం కొన్నాళ్ళు చదివే సరికి అవి కంఠత అవుతాయి. మొదట మా అమ్మాయి చేత నిత్యం శ్రీ బాబాగారి సూక్తులు చదివించి వినేవాళ్ళము. కొన్నాళ్ళకు ఆమెకు నోటికి వచ్చాయి. మీరు సూక్తులు చదవటంతో తృప్తి చెందకుండా వాటిని, వాటిలో ఇమిడి ఉన్న అర్థాన్ని మననం చేస్తూ నిత్య జీవితంలో ఆచరించండి. ఆచరించక మొదట జారి పోవడం జరుగుతుంది. అప్పుడు నిజమైన హృదయ పూర్వకమైన బాధతో బాబాను అర్థిస్తే వారే మనకు సహాయం చేసి ఆ బోధలు ఆచరణ యోగ్యం చేస్తారు. మనం ఆచరించలేని కాలములో కూడా ఆ సూక్తి చదివినపుడు, మననం చేసినపుడు, తప్పక మన హృదయములో కలుక్కుమని బాధ వ్యక్తమవుతుంది. ఎందుకు ఆ సూక్తి ఆచరించలేక పోయామే! అని. సూక్తులు వల్లిస్తూ కూడా నిత్యజీవితంలో మనం ఆచరిస్తున్నామా లేదా అనే విచక్షణ, ఆత్మవిమర్శ


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ ధగ్గాస్వామి

లేకుంటే మనకు దక్కేది సున్నా మాత్రమే. ఆచరించ లేకపోయినా ఆత్మవిమర్శ, ఆచరించేటట్లు చేయమనే ప్రార్ధన వలన మనకు కొంతలో కొంత మేలు జరుగుతుంది. గనుక శ్రీ స్వామి వారు మీకు చక్కని మార్గం చూపారు. ఆ మార్గాన పయనించి గమ్యం చేరండి.

నమస్కారములతో

పె.సుబ్బరామయ్య

రెండు గుంజలు భూమిలో పాతి ఉన్నారు. ప్రతి నిత్యం ఒక గుంజను కాస్త కదిలించి దానిని భూమి నుండి పెరికే ప్రయత్నం చేసి వదిలేస్తూ, ఆలా కొన్నాళ్ళు చేశామనుకోండి. మరియొక గుంజను అసలు తాకలేదనుకోండి, కొన్నాళ్ళయ్యాక కదిలించుచున్న గుంజ సులభంగా ఊడి వస్తుంది. పెరికి వేయవచ్చు. రెండవ గుంజ కదిలించలేదు. గనుక ఊడిరాదు. మన దోషాలు కూడా అంతే. నిత్యం హృదయములో కలుక్కుమని ఒకనాటికి అవే మన నుండి దూరం అవుతాయన్నమాట. అని మాష్టారుగారి వివరణ.

## కష్టాలు - అవగాహన

గొలగమూడి

21-01-1999

పూజ్యగురుబంధువు శ్రీమతి భవాని గారికి శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా కలుగవలెనని ప్రార్థిస్తూ పెసల సుబ్బరామయ్య వ్రాయడం.

మాష్టారు చేబుతున్నారు "మాయ తనకై తానే ఎవ్వరినీ తనను అతిక్రమించ నివ్వదు. మనమే మన ప్రత్యేక ప్రయత్నంతో మాయను అతిక్రమించాలి", అని శెలవిచ్చారు. మాయను అతిక్రమించ నంతవరకూ మీకు దు:ఖం తప్పదు. మాయను అతిక్రమించే ప్రయత్నమే భక్తి, సాధన. దానిని మనకు శ్రీ మాష్టరు గారు

అనుగ్రహించాలని రకరకాల కష్టాలు పెడుతుంటారు. ఆ కష్టాలను తట్టుకోలేక భగవంతుడు మనకు ఏమీ చేయలేదనుకుంటాము. భక్తిని నేర్చుకోమని మనకు ట్రైనింగ్ ఇవ్వడంలో ప్రథమ సూత్రం కష్టాలు. వాటిని (కష్టాలను) కష్టాలుగా గాకుండా, వారి ప్రసాదంగా స్వీకరించ గలిగితే ఎంత సంతోషంగా ఉంటుందో చెప్పలేను. అసలు మనం ఏమీ చేయలేము. అంతా ఆయనే చేస్తున్నాడు. ఆయన ఆడించే నాటకరంగంలో ఒక పాత్ర ఇచ్చి మనలను ఆడమన్నాడు - అని గుర్తెరిగి నడుచుకుంటే దు:ఖమే లేదు. అలాగాకుంటే మనం కొన్ని ఊహించుకొని అలా జీవించాలనుకొని ప్రయత్నిస్తే అంతా దు:ఖమయమే అవుతుంది. అన్నీ ఉండి, భర్త దగ్గరే ఉండి, కార్లలో తిరిగే వారికి ఎంత దు:ఖం హృదయంలో ఉంటుందో ఎప్పుడైనా ఊహించారా? అందరికీ అలా ఉండదు. చాలా మందికి ఉంటుంది ఎందుకు?

తీరని కోరికలే కారణం. ఉదాహరణకు: భర్తపై అనుమానం, ఆ పైన ఇద్దరికీ తగాదా. కొందరికి స్నేహితులు మోసం చేసినందున బాధ. ఢిల్లీలో ఒకరికి ఒక ఇండ్ల ప్లాటు ఉంది. వాళ్ళు బాడుగ ఇంట్లో ఎక్కడో ఉన్నారు. ఆ ఇండ్ల ప్లాటును ఒక దుండగుడు ఎవరో ఒకరికి నాదేనని చెప్పి అమ్మేశాడు. కొన్నవాడు ఇల్లు సగం కట్టినాక అసలు వాళ్ళకు తెలిసి వచ్చి అడిగితే, 20 రోజులలో మీకు డబ్బు ఇస్తాను. ఇప్పుడు stay తెచ్చి పని ఆపవద్దు అని బతిమాలి వారంలో slab వేసి మరొకరికి అమ్మి వెళ్ళిపోయాడు. 20 రోజుల తర్వాత వచ్చి చూస్తే మనుషులు మారారు. ఇప్పుడు కోర్టుకు పోయారు. కోర్టులో 3 సంవత్సరముల నుండి కేసు నడుస్తుంది. వీళ్ళ మనసుకు అంతా ఇంతా చికాకు కాదు. ప్లాటు ఖరీదు 10 లక్షల రూపాయలు, చూస్తూ పోగొట్టుకోలేరు. ఇలాంటి బాధలు ఎన్నో. అన్నింటికీ ఒకటే వైద్యం.

సాయి మాష్టరు గారికి వప్పచెప్పి నిశ్చింతగా ఉండగలగడం. ఎలా ఉండగలగడం? భవిష్యత్తులో మనగతి ఎలా? మన పిల్లల గతి ఎలా ఆనే చింత లేకుంటే నిశ్చింతగా ఉండగలము. అంతా చేసేది ఆయనైతే, మనం వేషగాళ్ళము మాత్రమేనని గుర్తిస్తే చింతేలేదు.

ఆశీస్సులతో

పె.సుబ్బరామయ్య

గొలగమూడి

21-01-1999

పూజ్య గురుబంధు శ్రీమతి నాగమణి గారికి శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా కలుగవలెనని ప్రార్ధిస్తూ పెసల సుబ్బరామయ్య వ్రాయడం.

మన మనస్సు బాగుండక పోయేందుకు ఒకటే కారణము. అది బాగా వంటపడితే తిరుగులేని రామబాణంగా మన మనస్సు నిరంతరం సాయి చెంతన ఉంటుంది. అదేమిటంటే మాష్టరుగారు అంటారు: "సాయి నిరంతరం మనవైపు చూస్తుంటే మనమెక్కడో ఆలోచిస్తూ పరధ్యానంలో ఉండడం అపచారం గదా!" ఈ కఠోర సత్యం వంట పడితే ఇక చీకు చింతలకు తావేలేదు.

మాష్టారు మరొకమాట అంటారు: "నీవు నిరంతరం మృత్యువుకు దగ్గరవుతున్నావని ఎప్పుడైనా గుర్తించావా?". ఈ రెండు విషయాలు వంట పడితే చింతకు తావేలేదు. మీ కుమారుని ఆక్సిడెంట్ అప్పుడు, మీరు గానీ మీ కుమారుడు గానీ ఆ క్షణంలో సాయిని పిలువలేదు గదా? వారే మనను ఆదుకున్నారు. అంటే వారు నిరంతరం మనవైపు చూస్తున్నారన్న మాట. మనమే ఆయనవైపు చూడకుండా వేరే అనవసరమైన ఆలోచనలలో ఉన్నామన్నమాట. మన ఆలోచనల వలన ఏమి ఒరుగుతుంది. కాలం వృధా అవడం తప్ప ఏమీ లేదు. మీ కుప్ప తగుల పెట్టేటప్పుడు కూడా సాయి చూస్తూనే ఉన్నారు. కానీ దాన్ని

ఆపలేదు. అది మన మంచికే అలా జరుగనిచ్చారు. ఆ పని చేసిన వారిపై ద్వేష భావం వహించడం, కొందరిని అనుమానించడం అంతా కూడా సాయిని మరచి మన ప్రయత్నాలలో ఉండడమే అవుతుంది. అది మన మంచికే సాయి జరిపారు. (అనే) అదొక్కటే మనకు శ్రేయోదాయకం.

25 సవర్ల బంగారం మా సొమ్మును మా మామగారి ఇంట్లో ఉంచితే దొంగలెత్తుకు పోయారు. నాకేమీ అనిపించలా. సగం శని పోయింది. జీవితాంతం వాటిని మనమెక్కడ సంరక్షించగలము అనిపించింది. గనుక మీరు మనసు పాడుచేసుకోవద్దు. ఆ పండ్లు పోతే మనకేమైంది. మృత్యువుకు దగ్గర కాకుండా పోయామా? మనసు పాడు చేసుకొని మన శ్వాసలు సాయిపరం చేసే పని మానివేస్తున్నాము. ఆయన నిరంతరం మనవైపు చూస్తున్నాడు, అనే విషయం మరచి పోతున్నాము. ఆ ఎరుకతో జీవించ ప్రయత్నించాలి. అదే ఆనందానికి మార్గం. అన్యచింతలన్నీ పతనం అవుతాయి. సాధనంతా మనోనాశనానికైతే ఇలాంటి భావాల వలన మనస్సు పెరుగుతుందట. ఇచ్చిన ఈ సదవకాశం సద్వినియోగం చేసుకుందాం. పిడక లేరుకునే పనికి స్వస్తి చెబుదాం. సాయినాథుని కరుణారసాన్ని మననం చేసుకుందాం. మృత్యువుకు దగ్గరవుతున్నామని అనుక్షణం గుర్తుంచుకుందాం. సత్సంగీయులందరినీ అడిగినట్లు చెప్ప ప్రార్థన.

నమస్తే

పె.సుబ్బరామయ్య

గొలగమూడి
17-09-1999

శ్రీ అడపా శ్రీనివాసరావుగారికి స్వామి ఆశీస్సులతో వ్రాయడం.

నీవు మానసిక బాధతో వ్రాసిన letter చేరినది. మేము గట్టున ఉన్నాము. ఏమైనా చెబుతాము. బాధ అనుభవించేది నీవే కదా! శ్రీ సాయినాథుడు పరమ కారుణ్యమూర్తి, ప్రేమమూర్తి. కానీ మనము పరమ అజ్ఞానులము. అందుకే వారిని ఆశ్రయించాము. వారిని ఆశ్రయించాక అంతా మన మంచికే జరుపుతున్నారని తలంచకుండా అన్యథా భావించడం ఎంతో బాధాకరమైన విషయం. మనం ఎన్ని మార్లయినా హారతి పాడుతాము. ప్రతిసారి 'త్వమేవ మాతాచ పితాత్వమేవ...', నీవే నా తల్లిదండ్రులు, బిడ్డలు, స్నేహితులు, సర్వం నీవే అని నోటితో మాత్రం అంటాము. వీరిలో ఎవరికి దూరమైనా మీలాగే బాధపడతాము. నిజంగా వారిని ప్రేమిస్తే మన బంధుమిత్రులు, బిడ్డలు వీళ్ళందరి వియోగం వలన దుఃఖమెందుకు? వీళ్ళంతా బాకీలు రాబట్టుకొనేందుకు మన చుట్టూ మూగిన వారే కానీ అన్యం కాదు. నిజంగా మనలను చివరి వరకూ అంటి పెట్టుకొని ఉండేవారు సాయి మాత్రమే. నీ బిడ్డను నీకు చూపిస్తే నీ మనసు ఎలా మారుతుందో ఆయనకు తెలుసు. నీ మంచి కొరకే నీకు ఆ బిడ్డను చూపడం లేదు. అసలు దు:ఖం లేకుండా ఉండినప్పుడే ఆయనను నిజంగా ఆశ్రయించామని లెక్క. లేకుంటే మనం కోరింది చేస్తాడని స్వార్థంతో ఆయనను ఆశ్రయించినట్లు లెక్క.

సంపూర్ణ శరణాగతి అంటే ఏమిటి? నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో ప్రభూ. నా మనసులో నీకు తప్ప మరి దేనికీ కోరిక లేకుండా ఉండేటట్లు చేయమని ప్రార్థించుట. చివరకు మన శరీరం మీద కూడా మనకు ఆశ


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ ఢగ్గాస్వామి

ఉండకూడదు. మనలను అన్ని బంధాల నుండి విముక్తి చేయాలని ఆయన చూస్తుంటే మనం క్రొత్తవి తగిలించుకోవాలని ఆరాట పడుతూ దు:ఖానికి గురి అవుతూ ఉంటాము. ఇదే అజ్ఞానము. ఈ అజ్ఞానం వదలనంత వరుకూ మనం నిజంగా ఆయనను ఆశ్రయించనట్లే లెక్క. ఆయనకు అభిషేకము, పూజ, హారతులు, సరిగ్గా టైం లో చేస్తేనే ఆయనను ఆశ్రయించినట్లు కాదు. దు:ఖం లేకుండా ఉండగలిగి ఆయన మీద మనసు పెట్టి ఉండగలిగితేనే నిజంగా మనం ఆయన పాదాలు పట్టుకున్నట్లు లెక్క. దు:ఖపడే పరిస్థితులు లేని వారికి వారు నిజంగా ఆశ్రయించింది లేనిది తెలియదు. నీలాంటి పరిస్థితులు సంభవించినపుడు నిజమేమిటో డూప్లికేటేమిటో తెలుస్తుంది. ఈ జగత్తు ఒక కల వంటింది. ఈ సత్యం బోధ పడేందుకు కృషి చెయ్యి. సర్వ జీవులూ బాబానే కదా. మరి నీ బిడ్డనే అంత ఎక్కువగా ప్రేమించి ఇతరుల మంచి చెడ్డలు పట్టకుండా ఉండడం తగునా? వ్యామోహం లేకుండా ఇతరులను ప్రేమించి సహాయం అందివ్వడం నేర్చుకో. మనకేమి జరుగుతున్నా దు:ఖంగానీ, సంతోషంగానీ లేకుండా ఉన్నప్పుడు ఆయనకు మన ఎడల మిక్కిలి వాత్సల్యం కలుగుతుంది. ఇది గీతా వాక్యము. శ్రీ సాయి నీకు జ్ఞాన భిక్ష నివ్వాలని ప్రార్థిస్తూ

మీ శ్రేయోభిలాషి
పె.సుబ్బరామయ్య

## గురు సేవ - అవగాహన

గొలగమూడి
30-09-1999
పూజ్యశ్రీ D.నాగేశ్వరరావు గారికి పెసల సుబ్బరామయ్య నమస్కారములు.

శరణాగతి కుదరడం లేదని వ్రాశారు. అది కుదరడం లేదని మీకెలా తెలిసింది. శరణాగతి అందరికీ ఒకేలాగ ఉండదని నా భావన. మరి లక్ష్మక్క గారు ఏమంటారో తెలియదు. కొందరు వ్యక్తులు బ్రతకాలని ఆశ కూడా లేకుండా శరణు పొందుతారు. అది అందరికీ సాధ్యమా? కానీ ఆ విషయం తప్ప తక్కిన వాటిలో ఏ ఆలోచన రానీయకుండా ఉండగలుగుతారు. మరి వీరికి శరణాగతి లేదని చెప్పగలమా? ఇక్కడొకతను అలా సంపూర్ణ శరణాగతి చెంది జబ్బుకు మందుకూడా తీసుకోకుండా మొండిగా ఉండేవాడు. ఈయన ఇలా చేస్తాడని శ్రీ స్వామి వారికి తెలుసు. కనుక ఇతనికింకా తీర్చవలసిన ఋణాలు, పొందవలసిన జమలు, ఈ శరీరానికి ఇంకా జరుగవలసిన మర్యాదలు ఊరకపోనిస్తారా. అలా జరగడమే God Principle గదా. సరిగ్గా ఈతడు మందు తినకుండా unconscious అయిపోయే సమయాన గుజరాత్ లో ఉన్న తన తమ్ముడు (ఇంజనీర్) వచ్చాడు. వెంటనే ఇతనిని ఆస్పత్రిలో unconscious స్థితిలో చేర్చాడు. స్పృహ వచ్చాక నేను వెళ్ళిపోతానంటాడు. డాక్టరు అలా వెళ్ళే వీలు లేదని గట్టి కాపలా పెట్టించి చికిత్స చేసి, మామూలు ఆరోగ్యం కలిగాక డిస్చార్జి చేశారు. అందరం ఆయనలాగా శరణాగతి చెందలేము. కానీ మనం శరణాగతి చెందలేదని చెప్పలేము. ఏ విషయములోనైనా మానసికబాధ లేకుండా మన ప్రయత్నాలు చేస్తూ, ఫలితం మనకు అనుకూలం కానీ ప్రతికూలం కానీ నిశ్చింతగా ఉంటే చాలు. అట్లా ప్రయత్నం చేయడం ద్వారా








ప్రయత్నించవలసిన మన ఖర్మ నివారణమొందుతుందని సంతోషంగా ఉంటే చాలు. 'ఏ జీవికి ఏమి రావాలో అవి వచ్చి తీరుతాయి' అనే ఒక్క విషయం మరిచి పోకుండా ఉండడం ముఖ్యం. అన్నీ మన ప్రయత్నంతోనే జరుగుతున్నాయా? లేదు. "మనం ఏమారి ఉన్నా, దైవం మనలను కంటికి రెప్పవలె కాపాడుతున్నారు" అనే సత్యం ప్రతిక్షణం గుర్తుంటే మానసికబాధ, టెన్షనుకు తావేలేదు. అలా టెన్షన్ లేకుండా, ఫలితం ఆశించకుండా, ప్రయత్నం చేయవలసిన మనకర్మక్షాళన అవడానికి కృషి చేస్తున్నాము అనే (ఆలోచనతో) పని చేస్తుంటే అదే శరణాగతి. మానసిక బాధ లేకుండడమే శరణాగతికి గీటురాయి. ఒకే పని చేసిన ఇద్దరూ విఫలులై ఉండవచ్చు, లేక సఫలులై ఉండవచ్చు. ఒకరికి బాధ మరొకరికి శాంతి - భగవంతుడు నా మ్రొక్కుబడికి స్పందించలేదు అనుకుంటే బాధ. ప్రయత్నించ వలసిన మన కర్మ తీరిపోయింది అనుకుంటే శాంతి.

సత్యం, ధర్మం తప్పకుండా నడుస్తూ మనలను చీకటి నుండి వెలుగులోకి నడిపించమని, నిచ్చెన మీద నుండి పడకుండా కాపాడమని ప్రార్థిస్తుంటే శరణాగతి ఆయన కృపతోనే కలుగుతుంది.

నమస్తే

పె.సుబ్బరామయ్య

గొలగమూడి

07-07-1999

పూజ్యులైన లక్ష్మిగారికి పెసల సుబ్బరామయ్య నమస్కారములు. మీకు లెటరు వ్రాయడంలో నా ఉద్దేశ్యము నాకు ఎక్కువ తెలుసునని కాదు. నా భావాలు మీతో పంచుకున్నందున లెటర్ ద్వారా సత్సంగం అని మాత్రమే.









నేను ఇంతకుముందు చివటం అమ్మ చరిత్ర 2, 3 సార్లు చదివాను. కానీ ఈ వాక్యం మాత్రం నా హృదయానికి హత్తుకోలేదు. అమ్మబోధ అనే అధ్యాయంలో 94 వ పేజీ, శారదా వివేక్ గారు వ్రాసిన పుస్తకంలో మూడవ పేరాగ్రాఫ్ లో "వత్తమైనా వచ్చిందంటే" అన్నారు, అమ్మ. ఆ మాట అందరు భక్తులు తర్కించి యోచించి హృదయగతం చేసుకోవలసిన వాక్యము. ఏ మహనీయుని దగ్గరకయినా, దేవాలయానికైనా ఎలా వెళ్ళాలి అనే విషయం అమ్మ బోధిస్తుంది.

ఇది నాకు గొప్ప బోధ. ఇది శ్రీ మాష్టరు గారు చెప్పిన మాటకు మరొక రూపము. కనీసం నామజపం, పారాయణ, ధ్యానం లాంటి కాలక్షేపాలతో చేరాలని వారి బోధ.

ఆ భక్తురాలికి అది పాఠమైతే నాకొక గొప్పబోధ చేశారు. "ఉండటమైనా నీకు వచ్చిందా" అని అడిగినట్లుంది. శ్రీ వెంకయ్య స్వామి వారి సన్నిధిలో ఎలా ఉండాలి. ఇంతటి గొప్ప సన్నిధి లభించినా దాన్ని సద్వినియోగం చేసుకుంటున్నానా? లేదు. అమ్మే నన్ను చెప్పుతో కొట్టినట్లు ఉంది. అందుకే మాష్టారు "ఇచ్చిన అవకాశము సద్వినియోగం చేసుకోకుంటే బూడిదై రాలిపోతావు" అన్న ఆదేశానికి చక్కగా సరిపోయింది. మహాత్ములు సమాధి చెందాక కూడా మనతో మాట్లాడటం అంటే ఇదేననుకుంటాను. ఇక దీనిని గూర్చి వారి వారి శక్త్యనుసారం ఆలోచించుకోవచ్చు.

శ్రీ పాకలపాటి గురువుగారి చరిత్ర చదవటం 3వ సారి అనుకుంటాను. అందులో ముఖ్యంగా చరమ సందేశం అనే అధ్యాయం నన్నెంతగానో ఆకట్టుకుంది.

అహం అంటే ఎంత సూక్ష్మంగా ఉంటుందో చూడండి, గాయత్రీ సిద్ధి అంటే ఏమిటి? ఉపదేశాలు, నామజపం, మంత్ర జపం - ఎన్ని విధాలైన బోధలో. అదే పుస్తకం 16, 17 పేజీలలో ఆ తలంపు రావడం, ఆ పని

చేయడం వేరుకాదు అన్నారు. ఎంత అమోఘమైన బోధ, మానసికంగా వ్యభిచరించని వారు మొదటి రాయి వేయండి అన్న క్రైస్తవ వాక్యాన్ని తలపిస్తుంది. అలాగే పేజీ 68, 75, 76 మరలా మరలా చదవాలి. మననం చేయాల్సిన బోధలు.

మహాసమాధి అనంతరం కూడా ఇట్టి దివ్యబోధలు చేస్తున్న శ్రీ మాష్టారు గారికి ఋణం చెల్లించడం ఎలాగో తెలియదు. అంతటా నిండియున్న ఆ పరతత్వమే తానైన వారి ఆజ్ఞలు పాటించే ప్రయత్నమైనా చేసి వారికి కృతజ్ఞత తెలుపుకుందాం. ఆచరణలో సఫలం కావాలంటే వారి దయలేక ఎన్ని జన్మలకైనా సఫలం కాలేను.

నమస్కారములతో

సుబ్బరామయ్య

గొలగమూడి

11-06-2003

పూజ్య గురుబంధువులైన శ్రీరామశాస్త్రి గారికి సుబ్బరామయ్య నమస్కారములు.

శ్రీ స్వామి వారికి ఎలా కృతజ్ఞతలు తెలుపాలో మీకు చక్కగా తెలియటం లేదు. అసలు ఆయనకు కృతజ్ఞతలు ఎందుకు చెప్పాలని కూడా మీరు అడుగవచ్చు. ఒక్క సాయి విషయం M.Tech దగ్గర నుండి తిరిగి ఆలోచించుకోండి. బాగా నిదానంగా తీరికగా యోచించండి. వారి దర్శనం వల్ల మనకు కలిగే గొప్పలాభమేమో నేను ఇక్కడ వ్రాయలేను. అవధూత లీలలో శ్రీ మహావిష్ణువు యొక్క అవతారమైన శ్రీ మాష్టరుగారే వ్రాశారు - సద్గురుని ఎప్పుడు దర్శించాలి అనే విషయం.

ఈ 500 రూపాయలు ఒక భక్తుడు శ్రీ స్వామి దర్శనం వచ్చేవారికి loan గా ఇవ్వమన్నాడు. No Interest. మీకు వీలున్నపుడు ఇవ్వండి.

సంవత్సరాలు గడిచినా అతడు అడుగడు. వారిని ఆపకుండా శ్రీ స్వామి వారి దర్శనానికి పంపినందుకు మీకు శ్రీ స్వామివారే ఈ ప్రసాదం పంపుతున్నారు. సాయి చరిత్రలో మాంసం అని అసహ్యించుకొని నీళ్ళలో పారవేసిన పిచ్చి బ్రాహ్మణుని వలె చేయరని ఆశిస్తాను.

నమస్కారములతో
పెసల సుబ్బరామయ్య

## సాధన-గురు కృప

గొలగమూడి
22-09-1994

పూజ్య గురు బంధువు శ్రీమతి D. నాగమణి గారికి పె.సుబ్బరామయ్య నమస్కారములు. శ్రీ దర్గా స్వామి వారు "మీకు దత్తానుగ్రహం ఉన్నది" అని అన్నారు. గనుక అది గొప్ప ఆశీర్వాదము. ఆ ఆశీర్వాదముతో మనం గర్వించకుండా తగు కృషి చేస్తుంటే వెయ్యి రెట్లధికంగా వారి ఆశీస్సులు మనకి అనుభవమవుతుంటాయి.

వారు నిత్యం, నిరంతరము మిమ్ములను స్మరించమన్న శ్లోకం

శరీరం ఇంద్రియం ప్రాణం, అర్ధస్వజన బాంధవాన్
ఆత్మధారాధికం నేస్తం సద్గురుభ్యోన్నివేదయేత్

"గురువే సర్వాధికారి, అల్లా మాలిక్" అన్న భావం మరచిపోకుండా, ఏ మారకుండా ఉండమని. సర్వం సద్గురుకర్పిస్తుంటే వారు మనలను తప్పక గమ్యం చేరుస్తారు. దత్తానుగ్రహముంది గనుక మన కృషి చక్కగా ఉండాలని భావం. అనుగ్రహం లేని వారు కృషి చేయలేరు. చేసినా సరిగా చేయలేరు. గనుక పారాయణ, మననము, పూజ, జపం చేస్తూ ఉండండి. దత్తానుగ్రహం వేయిరెట్లుగా మీకే అనుభవమవుతుంది.

నమస్తే


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

పె.సుబ్బరామయ్య

గొలగమూడి

22-09-1994

పూజ్య గురుబంధువు శ్రీమతి దారా జయలక్ష్మి గారికి పె.సుబ్బరామయ్య నమస్కారములు, ఉభయకుశలోపరి.

1. శ్రీ దర్గా స్వామి వారు మీ చేత తంతుకుని విషయం తీయించి చదివించారు. ఎంతో మంచిది. తంతుకునకు ఎంత మంచి విశ్వాసము ఉందో వారి గురువుగారి యందు మనము ఊహించలేము. నోటితో చెప్పలేము. కాగితంపై వ్రాయలేము. వారి వంటి దివ్యమైన అనుభవం మనం పొందలేము గదా. శ్రీ గురుమూర్తి ఎడల తంతుకుని వంటి విశ్వాసము మనకుండాలి. మన విశ్వాసం మేరకు శ్రీ గురుని సహాయం మనకందుతుంది. శ్రీ గురుడు సర్వత్రా ఉన్నాడనే విశ్వాసం మనకు ధృడంగా ఉండాలి. శ్రీ గురుని సంకల్పముతో మనలోని బలహీనతలు తప్పక రూపుమాపబడతాయి. అయితే మనకట్టి విశ్వాసం వారి ఎడల మనకుండడమే ప్రధానమైన విషయము.

2. జిహ్వ జయించలేకపోతున్నానని అనుక్షణం బాధపడుతుంటే ఆ బలహీనత మనలో మరింత మేర పాతుకుంటుంది. మీ బాధను కన్నీటితో ఆ గురుమూర్తికి నివేదించండి. తప్పక కరుణిస్తాడు. జిహ్వచాపల్యం ఏ పదార్థాల మీద ఉందో, ఆ పదార్థాలు కొని అందరికీ పంచండి. పంచేటప్పుడు, తినేవారు సాయిరూపాలుగా భావించండి. తప్పక శ్రీ గురుని కరుణ కలుగుతుంది.

3. కోపము పోవాలి అని అడిగామని వ్రాసారు. శుభం. భగవద్గీతలో కోపమెందుకు వస్తుందో చెప్పారు కృష్ణపరమాత్మ. ఈ

కోపం 3 విధాలు (1) జ్ఞానుల కోపం  (2) ధర్మాత్ముల కోపం (3) మూర్ఖుల కోపం.

(1) జ్ఞానుల కోపం నీటి మీద వ్రాసిన అక్షరం లాగ మరుక్షణంలో మాయమవుతుంది.

(2) ధర్మాత్ముడు కోపం ఇసుక మీద వ్రాసిన అక్షరం లాగ కొన్ని క్షణాల తరువాత సమసిపోతుంది.

(3) మూర్ఖుల కోపం రాతిపై చెక్కిన అక్షరం లాగ శాశ్వతంగా ఉండి పోయి ఎదుటివారికి హానిచేయాలని ప్రయత్నిస్తూ అలా చేస్తుంటారు.

మన కోపం క్రమంగా మార్పులు చెందుతూ జ్ఞానానికి దారి తీస్తుంది. జ్ఞానులను చేస్తుంది. మీకు త్రాచుపాము కధ తెలుసనుకుంటాను. ఒక త్రాచుపాము సాధువును తరుణోపాయం అడిగిందట. నీవు ఇతరులకు హాని చేయకుంటే, నీవు తరించగలవని తెల్పినాడు. అది మొదలు, అది అమాయకుడైన పిల్లవాని వలె అందరిచేత దెబ్బలు తింటూ వళ్ళంతా గాయాలై చావలేక బతికే ఉంది. ఆ సన్యాసి రెండవసారి కనిపిస్తే తన దీనగాధ వినిపించి ఏడ్చిందట. ఆ సాధువు , ఓసి పిచ్చి తల్లీ "ఇతరులకు హాని చేయవద్దంటే కరవవద్దని చెప్పాను గానీ, బుసకొట్టి భయపెట్టవద్దని చెప్పానా.  నీ ఆత్మరక్షణకు పరిగెత్త వెళ్లవద్దని చెప్పానా అని సలహా ఇచ్చాడట. అది మొదలు ఆ పాముకు బాధలు తొలగి అలాగే నడుచుకుంటూ సుఖపడిందట. మనమూ అంతే.

కోపానికి మూలం కోరిక. అది చిన్నదే కావచ్చు. పెద్దదే కావచ్చు. కోపం వలన బుద్ధి నశించి, మంచి చెడ్డలు తెలుసుకొని ఆచరించలేక ఆత్మవినాశము కొని తెచ్చుకుంటాము. కనుకనే శ్రీ స్వామి వారు "ఆశపోతే అంతా పోతుండ్లాయ్యా" అన్నారు.  అల్లామాలిక్ అనే మాటకు వ్యతిరేకమయినదే ఈ కోరిక - కోపము.












అల్లా ఎలా నడిపిస్తే అలా చూస్తూ కూర్చోవడం నేర్చుకోవడమే సాధన. మనలోపల నుండి రాగం.. అంటే కోరిక పోతే అన్నీ సమకూరుతాయి. కోపానికంటే ముందు, కోరిక లేకుండా సర్వగతుడైన శ్రీ గురుమూర్తిని స్మరిస్తుంటే సర్వమునకు కర్తయైన శ్రీ సద్గురుమూర్తి సర్వము సమకూర్చగలరు.

నమస్కారములతో

పె.సుబ్బరామయ్య.

శరీరంలో త్రిమూర్తులు ఉంటారని చెప్పారు. దాని అర్థం మనకు అనవసరం. “కూరలో ఉప్పు సమంగా వేసుకొని రుచిగా తినడం అవసరంగాని, ఉప్పు ఏ ఏ మూలకాలతో చేశారు, ఆ మూలకాల స్వాభావం ఏమి, ఇదంతా మనకు అవసరం లేదు కదా”. మనకు సాధన ముఖ్యం. అది శ్రీ గురుని పాదాలు తంతుకునిలాగా పట్టుకుంటే శ్రీ గురుడే సర్వం సమకూర్చగలరు. విశ్వాసంతో పారాయణ, మననము, నిధి, ధ్యాసనము చేస్తుండండి. సకాలంలో సర్వమూ సమకూరగలదు. శ్రీసాయి, శ్రీ స్వామి లాంటి మహనీయుల చరిత్రలు పారాయణ, చర్చ, ఆత్మలో గానీ ఇతరులతో గానీ చేస్తుంటే సర్వమూ సమకూడ గలవు.

గొలగమూడి

22-09-1994

పూజ్య గురుబంధు శ్రీ దారా నాగేశ్వరరావు గారికి సుబ్బరామయ్య నమస్కారములు. ఉభయకుశలోపరి.

1. మీరు దర్గాస్వామి వారికి లెటరు వ్రాయవచ్చు. అందులో తప్పేమీ లేదు. నెల్లూరు జయమ్మ వాళ్ళకు కూడా వారు లెటరు వ్రాశారని విన్నాను. అందులోనూ మనం సాధన గురించి వ్రాస్తున్నాము, కానీ

దుర్విమర్శలు వ్రాయడం లేదు. సాయినాధుని కృప వలన వారి నుంచి రిప్లై వస్తే మంచిదే, రాకున్ననూ మీరేమీ బాధ పడవద్దు. మనకు ఆ లెటరు ద్వారా ఏమి కావాలో దాన్నే వారు మనకు లెటరు లేకుండా కూడా సమకూర్చుతారు.

2. అందరినీ సమానంగా ఎందుకు చూడాలనుకుంటున్నారో వ్రాయలేదు. శ్రీ వెంకయ్య స్వామి వారు ఒకసారి అంటారు "అందరినీ సమానంగా చూచుకుంటే దేవుడు కనబడతాడు" అని బోధించారు. మన ధ్యేయం భగవద్దర్శనమేనా?

చూడటం అనే క్రియ వచ్చినప్పుడు 2 విధాలుగా చూడడం జరుగుతుంది.

1. భావాద్వైతం సదా కుర్యాత్ క్రియాద్వైతం నకుర్వచిత్

అంతటా భగవంతుడే ఉన్నాడు అనే "భావం" సదా చేయవలెనని, "క్రియారూపం"లో అలా చేయరాదని పెద్దలు చెప్పారు. త్రాచుపాములోనూ, రామచిలుకలోనూ రెండింటిలో కూడా భగవంతుడే ఉన్నాడు. మనలోనూ ఆ భగవంతుడే ఉన్నాడు. మరి రామచిలుకను, త్రాచుపామును క్రియారూపంలో ఇంటిలో ఒకే చోట ఉంచదగునా? (సాధకుని దశలో) శ్రీ సాయి, శ్రీ స్వామి, శ్రీ రమణమహర్షి వద్దకు కూడా ఎప్పుడో పాములు వచ్చి వారి దర్శన , స్పర్శన భాగ్యాలు పొంది వెంటనే వెళ్ళి పోయి వాటి స్థానాలలో ఉండేవే కానీ, మనుషులు, ఆవులు, కుక్కలు ఉన్నట్లు నిరంతరం వారి పాదాల చెంత ఉండలేదు. ఉండనివ్వరు కూడా. అలాగే అందరినీ సమానంగా భావన చేయవచ్చుకానీ, సమంగా క్రియారూపంలో సాధకులు చేయరాదు అని పెద్దల వాక్యం. ఎవరికి ఇచ్చే treatment వారికివ్వాలి. భార్యకు, కుమార్తెకు ఒకే treatment కుదరదు కదా. భావంలో వారిద్దరిలోనూ, భగవంతుడే ఉన్నాడు అనే భావం సదా చేయవచ్చు.


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దత్తాస్వామి

గనుక మనం శ్రీ సాయి, శ్రీ స్వామి వారి స్థితికి పోయినంత వరకూ అందరినీ సమానంగా భావించడమే కానీ, క్రియా రూపంలో different గానే ఉండాలని మహనీయుల వాక్యం గనుక అందరినీ సమానంగా చూడలేకున్నానని మీరేమీ బాధపడవలసిన అవసరం లేదు. అంతకు ముందు మనలో రావలసిన అనేక మార్పులు తీసుకురావాలి. ఆ విషయం మనది కాదు శ్రీ సద్గురు మూర్తి కర్తవ్యం. మన కర్తవ్యం ఒక్కటే. ఎప్పుడూ వారిని స్మరిస్తూ మమ్ము సరైన మార్గాన నడిపించండి. ఏమి చేసి మీ కృప పొందగలమో అది బలవంతంగానైనా మాచేత చేయించండి అని ప్రార్థించుచుండడమొక్కటే మనంచేయదగ్గ కృషి. లౌకిక విషయాలు తగ్గించి మన కాలంలో సాధ్యమైనంత ఎక్కువగా ఆధ్యాత్మికత వైపు మళ్ళిస్తుంటే, ఆ సద్గురుమూర్తి సర్వం సమకూర్చగలరు. 10వ అధ్యాయం నిత్యం పారాయణ చేసి మననం చేయండి. మీలో మీరు మరియు ఇతరులతో ఆ అధ్యాయం గురించి చర్చించండి. మనన నిధి ధ్యాసనలు చేయండి. సర్వం శ్రీ సద్గురుమూర్తి తప్పక సమకూర్చగలరు. పాత బంధాలు విడగొట్టుకుంటూ, కొత్త బంధాలు తగులుకోకుండా చూచుకుంటూ ఉండవలెను. అది కూడా శ్రీ సద్గురుడే సమకూరుస్తాడు. ఎప్పుడు? మనం వారిని స్మరించి వారి బోధ మననం చేసి ఆచరించినపుడు. ఆచరించ లేకుంటే హృదయ పూర్వకమైన పరితాపంతో వారిని ప్రార్థిస్తే తప్పక వారి సహాయ సహకారములందగలవు. శ్రమతో అందరి దగ్గరా వారి వారి అనుభవములు సేకరించి పంపినందుకు చాలా సంతోషం.

నమస్తే,

పె.సుబ్బరామయ్య (PSR)